క్లుప్తంగా

ఇకపై నిత్యం ఉచిత ప్రసాదం పంపిణీ



భక్తులకు ఉచిత ప్రసాదం అందజేస్తున్న అర్చకుడు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల సీతారామ చంద్ర స్వామి వారి దేవస్థానంలో భక్తులకు ఉచితంగా అందించే ప్రసాదాన్ని ఇకపై నిత్యం అందించనున్నట్లు ఆలయ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్ తెలిపారు. గతంలో శని, ఆదివారాల్లో అందించే ఈ ప్రసాద వితరణను, శుక్రవారం నుంచి ప్రతి నిత్యం అందించే విధంగా అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు స్వామివారి దర్శనం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ అందిచనున్నట్లు ఆయన తెలిపారు.

వృక్ష సంరక్షణ అందరి బాధ్యత



వృక్షానికి ఉన్న ప్రకటన బోర్డును తొలగిస్తున్న అధికారులు

మణుగూరురూరల్: వృక్షాలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మణుగూరు ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం వన దేవత సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని ప్రధాన రహదారికి ఇరువైపులా వృక్షాలకు కొట్టిన మేకులు, తాళ్లు, ప్రకటన బోర్డులను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వృక్షాలకు ప్రాణం ఉంటుందని, వాటిని బాధించవద్దని సూచించారు. ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ మండల అధ్యక్షుడిగా రామలక్ష్మణ్

చర్ల: బహుజన సమాజ్ పార్టీ చర్ల మండల అధ్యక్షుడిగా గోగీకార్ రామలక్ష్మణ్‌ను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ భద్రాచలం నియోజకవర్గ అధ్యక్షుడు కొండా చరణ్ ఓ ప్రకటన విడుదల చేశారు. నూతనంగా మండల అధ్యక్షుడిగా నియమితులైన రామలక్ష్మణ్ మండలంలో సామాజిక పరివర్తన ఉద్యమాన్ని ముందుకు నడిపిస్తారనే నమ్మకం ఉందన్నారు. రామలక్ష్మణ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి ఈ పదవిని తనకు ఇచ్చిన అధినాయకత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

రెగ్యులర్ మెజిస్ట్రేట్‌ను నియమించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాదులు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం మొబైల్ కోర్టుకు రెగ్యులర్ మెజిస్ట్రేట్‌ను నియమించాలని కోరుతూ.. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్, భద్రాచలం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయంలో స్పందించిన కలెక్టర్.. రెగ్యులర్ మెజిస్ట్రేట్‌ను నియమించడం, బడ్జెట్ కేటాయించడం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ అధ్యక్షుడే ఎంవీ ప్రసాదరావు, ప్రధాన కార్యదర్శి రమేష్ కుమార్ మక్కడ్, భద్రాచలం యూనిట్ అధ్యక్షుడు బండారు అరుణ్ చంద్, ప్రధాన కార్యదర్శి పాయం రవివర్మ, కమిటీ సభ్యులు పేరాల వెంకటేశ్వర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

రేపు దివ్యాంగుల మహాగర్జన

అశ్వాపురం: ఆసరా పెన్షన్లు పెంపునకు ఈ నెల 10న పినపాక మండలం ఏడూళ్లబయ్యారం క్రాస్‌రోడ్డులో జరిగే వృద్ధులు, దివ్యాగుల మహాగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఇసంపల్లి కృష్ణ అన్నారు. మండల కేంద్రంలో ఎస్సీ కాలనీలో శుక్రవారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పెన్షన్ రూ.6 వేలు, ఇతర ఆసరా పెన్షన్లు రూ.4వేలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. మహాగర్జన సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు గురజాల వెంకటేశ్వర్లు, వెంకన్న, గోపి, కాంతారావు, కన్నయ్య, తాజ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



తోగు నుంచి నీరు తెచ్చుకుంటున్న ఆదివాసీ పిల్లలు (ఫైల్)



వ్యాధి బాధితుడిని చికిత్స కోసం జట్టి కట్టి తీసుకెళ్తూ..

జీవన పోరాటంలో అడవి బిడ్డలు

- కనీస సౌకర్యాలకు నోచుకోని ఆదివాసీ గ్రామాలు
- కలగానే విద్య, వైద్య సౌకర్యాలు

నేడు ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

కరకగూడెం: దట్టమైన అడవులు.. కారు చీకట్ల నడుమ కల్మషం లేని మనుషులు ఆదివాసీలు. పోడు సాగు.. జొన్న అన్నం.. పశు సంపదే వారి జీవనం. కారడవిలో కాలం వెళ్లదీస్తున్న వలస ఆదివాసీల బతుకులను చూస్తే ఎవరి మనసైనా చలించాల్సిందే. ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన వారికి.. కనీస సౌకర్యాలు లేవు.. ప్రభుత్వ పథకాలు అందవు. విద్య, వైద్యానికి కూడా నోచుకోకుండా వారి జీవనం సాగుతోంది.

కనీస సౌకర్యాలు కరువు

నేటికీ మారుమూల ఆదివాసీ గిరిజన గూడేలకు సరైన రోడ్లు, రవాణా వసతులు లేవు. దీంతో అత్యవసర సమయంలో ప్రాణాల మీదకు వస్తోంది. వానాకాలంలో వాగులు, వంకలు పొంగి ఊరు దాటి బయటకు వెళ్లే పరిస్థితులు ఉండవు. అయినా అధికారులు ఇలాంటి గ్రామాల వైపు కన్నెత్తయిన చూడడం లేదు. ఇక ఆదివాసీ మహిళలను రక్తహీనత సమస్య వెంటాడుతుండగా.. ప్రసవ సమయంలో వైద్యం అందక ప్రాణాలకు ముప్పుగా పరిణమిస్తోంది. వీటికి తోడు వేసవి కాలంలో తీవ్ర తాగునీటి ఎద్దడిని ఎదుర్కోవాల్సి వస్తోంది. గ్రామాల్లో విద్యుత్ సౌకర్యం, సరైన పాఠశాలలు లేక పోవడంతో విద్య కలగానే మిగులుతోంది. వలస ఆదివాసీ విద్యార్థులకు కులం సర్టిఫికెట్ ఇవ్వకపోవడంతో యువత ఉద్యోగాలకు, విద్యకు దూరమవుతున్నారు.

ప్రత్యేక సంప్రదాయాలు

అడవే జీవనాధారంగా వలస ఆదివాసీలు ముందుకు సాగుతున్నారు. అటవీ ఉత్పత్తులను సేకరించి మార్కెట్‌లో అమ్ముకుంటారు. అలాగే, కర్రలతో బుట్టలు, తడికలు తయారుచేసుకుని విక్రయిస్తుంటారు. పోడు భూముల్లో వరి, మొక్కజొన్న, పత్తి తదితర పంటలను సాగు చేస్తున్నారు. ఇక కాలానికి అనుగుణంగా వచ్చే మార్పుల ఆధారంగా పండుగలు నిర్వహించుకుంటారు. పశు సంపదే ఆస్తిగా భావిస్తారు. ఆదివాసీల పెళ్లిలో పెళ్లి అమ్మాయికి ఎదురుకట్నం ఇవ్వడం అనాదిగా వస్తున్న ఆచారం. వేల కుటుంబాలుగా ఉన్న ఆదివాసీలు ఈ సమస్యల పరిష్కారం కోసం, తమ గూడేల అస్థిత్వం కోసం సంవత్సరాలు పోరాడుతున్నారు. ఆదివాసీ దినోత్సవ సందర్భంగానైనా వీటిపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృషి సారించాల్సి ఉంది.

సమస్యలు పరిష్కరించాలి..



మా ఆడోళ్లకు ఒంట్లో రక్తం తక్కువై బలహీనంగా ఉంటారు. వేసవిలో నీళ్ల కోసం దూరం పోవాలి. పిల్లలు స్కూల్‌కు పోవాలంటే కిలోమీటర్లు నడవాలి. మాకు పెద్ద మేడలు కాకుండా గూడెంలకు రోడ్లు వేసి నీరు, కరెంట్ అందిస్తే చాలు.

– మడివి లక్ష్మయ్య, రేగళ్ల

ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదు..



గిరిజన గ్రామాలకు రవాణా, విద్యుత్ లేకపోగా పాఠశాలలు లేవు. ఆదివాసీ మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ప్రయత్నించడం లేదు. ఇకనైనా మా జీవితాల్లో మార్పు కోసం కృషి చేయాలి.

– కొమరం కాంతారావు, సీపీఎం మండల కార్యదర్శి

ఆర్టీసీ కార్మికుల ఆందోళన



డిపో ఎదుట ఆందోళన చేపడుతున్న ఆర్టీసీ కార్మికులు

మణుగూరురూరల్: టీజీఆర్టీసీ మణుగూరు డిపో మేనేజర్.. మహిళా కండక్టర్ల పట్ల వ్యవహరిస్తున్న వైఖరికి నిరసనగా శుక్రవారం ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు డిపో ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. ప్రయాణికుల ఫిర్యాదునే ఆధారంగా తీసుకుని తమ తప్పులేకున్నా మహిళా కండక్టర్లను వేధింపులకు గురి చేస్తున్నారని వారు ఆరోపించారు. డీఎంపై ఆర్టీసీ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఆర్టీసీ చైర్మన్ సజ్జనార్‌కు సైతం ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఆందోళన సమాచారం అందుకున్న సీఐ పాటి నాగబాబు సిబ్బందితో డిపోకు చేరుకుని ఆందోళన కారులతో మాట్లాడి నచ్చజెప్పారు. సీఐ సూచనలతో కార్మికులు ఆందోళనను విరమించారు. కాగా డిపో మేనేజర్ ఈ విషయంపై సోషల్ మీడియాలో స్పందిస్తూ.. రిక్వెస్ట్ బస్‌స్టాప్‌ల వద్ద బస్సులు ఆపకపోవడంపై సూచినలు ఇచ్చాం తప్పా.. ఎటువంటి వేధింపులకు పాల్పడలేదని తెలిపారు.

ఓటర్ జాబితా సవరణపై నిరసన

భద్రాచలంఅర్బన్: బీహార్‌లోని ఎన్నికల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల సమగ్ర సవరణ విధానాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బండారు శరత్ బాబు అధ్యక్షతన ఈ కార్యక్రమం చేపట్టగా.. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎంబీ నర్సారెడ్డి మాట్లాడుతూ.. బీహార్‌లో ఎలాగైనా అధికారాన్ని నిలుపుకోవాలని ఉద్దేశంతో అధికారంలో ఉన్న బీజేపీ.. ఎన్నికల సంఘాన్ని పావుగా ఉపయోగించుకుంటోందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి వర్గసభ్యుడు వెంకట్రామారావు, పట్టణ కమిటీ సభ్యుడు ఎస్.నాగరాజు, కోలగాని రమేష్ , కోరాడ శ్రీనివాస్, ఫిరోజ్, అజయ్ కుమార్, రాఘవయ్య, రవి, మురళీకృష్ణ, నాగమ్మ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



భద్రాచలంఅర్బన్: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

దమ్మపేట: బీహార్ రాష్ట్రంలో జరగనున్న ఎన్నికల సందర్భంగా ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని సీపీఎం జిల్లా నాయకుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా అర్జున్ మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ పేరుతో ఓటర్లను జాబితా నుంచి తొలగించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ఎన్నికల సంఘం పక్షపాత ధోరణితో వ్యవహరించకుండా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొప్పుల శ్రీను, మురహరి రఘు, సీత, జయ, జ్యోతి, కృష్ణవేణి, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి



దుమ్ముగూడెం: ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో ఆదివాసీ నాయకులు

ములకలపల్లి: అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎరుకల ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి గరికె శ్రీనివాస రావు పిలుపునిచ్చారు. ములకలపల్లిలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఎరుకల హక్కుల పోరాట సమితి మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. గరికె యాదగిరి, గరికె వెంకటేశ్వర్లు, పొన్న వెంకటేశ్వర్లు, గరికె నాగేశ్వరరావు, కృష్ణ, మొగిలి ప్రకాష్ పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండల కేంద్రం లక్ష్మీనగరంలో నేడు జరిగే ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ ఐక్యకార్యచరణ సంఘాలు పిలుపునిచ్చాయి. శుక్రవారం సంఘాల ఆధ్వర్యంలో కే రేగుబల్లి ఆశ్రమ పాఠశాల, ఏకలవ్య పాఠశాలను సందర్శించి ఆదివాసీ హక్కులు, రిజర్వేషన్లు, సాంస్కృతి సాంప్రదాయాలను వివరించారు. వాటిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల గౌరవ అధ్యక్షుడు కొమరం దామోదర్ రావు, అధ్యక్షుడు సోయం కామరాజు, ఉపాధ్యక్షుడు కుంజా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు కనితి రాముడు, తునికి కామేష్, పోడియం సుబ్బారావు, సరియం కోటేశ్వరరావు, వాగే కృష్ణ పాల్గొన్నారు.

అశ్వారావుపేటరూరల్: ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆదివాసీ ఉద్యోగ జేఏసీ బాధ్యులు కోరారు. శుక్రవారం అశ్వారావుపేటలోని ఎస్టీ బాలుర వసతిగృహం వద్ద జరిగిన ఆ సంఘం సమావేశంలో ఈ మేరకు పలువురు మట్లాడారు. సమావేశంలో జేఏసీ బాధ్యులు మడివి కృష్ణారావు, కొర్రి వెంకటేశ్వరరావు, మడకం వెంకటేశ్వర్లు, సున్నం నాగేశ్వరరావు, కుంజా సుబ్బారావు, కొర్సా వెంకటేశ్వరరావు దొర, తాటి రామారావు, దారబోయిన చలమరావు, పద్దం రాము, గడ్డం రాజాబాబు, కట్టం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి

దమ్మపేట: గుండెపోటుతో మృతిచెందిన అంకంపాలెం గ్రామవాసి, కాంగ్రెస్ క్రియాశీల కార్యకర్త వగ్గెల వెంకటేష్ తల్లి కాంతమ్మ(43) భౌతిక కాయానికి స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ శుక్రవారం నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను ఓదార్చి, అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు కాకా రమేష్, మోటాళ్ల గురుమూర్తి, వాడే వెంకటరావు, వంకా బాబు, కాకా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు అభిషేకం

గుండాల: స్థానిక ముత్యాలమ్మ గుడి ఆలయ నిర్మాణ దాత పట్వారీ వెంకన్న–హరిప్రియ దంపతుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా అభిషేకం నిర్వహించారు. శ్రావణ మాస శుక్రవారాన్ని పురస్కరించుకుని బొడ్రాయి, ముత్యాలమ్మకు పాలాభిషేకం, జలాభిషేకం చేశారు. ఆయా గుడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడి పంటలు చల్లంగ ఉండాలని, ఆయురారోగ్యాలతో జీవించేలా దీవించాలని వేడుకున్నారు.

రాఖీ కొనుగోళ్ల కోలాహలం

దమ్మపేట: మండల కేంద్రం దమ్మపేట గ్రామంలోని ప్రధాన సెంటర్‌లో పలు రాఖీ దుకాణాలతో శుక్రవారం సందడి వాతావరణం నెలకొంది. దమ్మపేట సెంటర్‌లో పదుల సంఖ్యలో దుకాణాలు వెలిశాయి. దుకాణాల్లోని రాఖీలు పలు రకాల రంగులు, డిజైన్లలో చూపరులను ఆకట్టుకుంటున్నాయి. మహిళలు, యువతులు రాఖీలను ఆసక్తితో తిలకించి, తమకు నచ్చిన వాటిని కొనుగోలు చేస్తున్నారు.

కరకగూడెం: రాఖీ పండుగను పురస్కరించుకుని మండల కేంద్రంలోని మార్కెట్ ప్రజలతో కళకళలాడింది. సోదరసోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ కోసం శుక్రవారం ప్రజలు భారీగా రాఖీలను కొనుగోలు చేశారు. చిన్న పిల్లల కోసం కార్టూన్ బొమ్మల రాఖీల నుండి పెద్దల కోసం సంప్రదాయ రాఖీల వరకు అన్ని రకాల రాఖీలు దుకాణాలల్లో ఉండగా.. సోదరీమణులు నచ్చిన రాఖీలను ఎంపిక చేసుకుంటూ ఉత్సాహంగా కొనుగోళ్లు చేశారు.



దమ్మపేటలో రాఖీలను పరిశీలిస్తున్న మహిళలు, యువతులు



కరకగూడెంలోని ఓ షాప్ వద్ద..

నిరుపయోగంగా ప్రకృతి వనం



కూలిపోయే స్థితిలో ఉన్న పల్లె ప్రకృతి వనం బోర్డు, గేటు..

అశ్వారావుపేటరూరల్: లక్షలాధి రూపాయాల వ్యయంతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం నిర్లక్ష్యం కారణంగా నిరుపయోగంగా మారింది. మండలంలోని వినాయకపురంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం కనీస నిర్వహణ లేకపోవడంతో అడవిను తలపిస్తూ.. ఆధ్వానంగా మారింది. ప్రకృతి వనం గేటు వర్షాలకు కిందికి దిగిపోయింది. పట్టుకుంటే పడిపోయేలా ఉంది. అలాగే గేటు వద్ద భారీ గొయ్యి పడటంతో స్థానికులు వెళ్లేందుకు దారి లేకుండా పోయింది. ఈ విషయాన్ని స్థానికులు పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఇన్‌చార్జ్ ఎంపీఓ రామారావును 'సాక్షి' వివరణ కోరగా.. ఈ సమస్య తన దృష్టికి రాలేదని, పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని అన్నారు.

గురుకుల డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

అశ్వాపురం: మండల పరిధిలోని మిట్టగూడెంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలుర డిగ్రీ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 11, 12 తేదీల్లో స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ బండారుపల్లి రవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన లేదా తత్సమాన అర్హత కలిగిన గిరిజన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలలో సమర్పించి అడ్మిషన్ పొందాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఈ చివరి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

11 నుంచి యోగా శిక్షణ

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సీతారామ కమ్మ సేవాసమితి భవనంలో భద్రాద్రి యోగా ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో నెల 11 నుంచి సెప్టెంబర్ 9 వరకు యోగా శిక్షణా శిబిరం నిర్వహించనున్నట్లు శిక్షకుడు నరేష్ గురుజీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. నెల రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణకు 14 సంవత్సరాల పైబడిన వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు తమ వెంట యోగా మ్యాట్, టవల్, వాటర్‌బాటిల్ తీసుకురావాలని సూచించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

ములకలపల్లి: మండల పరిధిలోని తిమ్మంపేట గ్రామంలో జీపీ కార్యాలయ వీధిలో సీసీ రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాంద్ర ప్రభాకర్ రావు శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేక చొరవతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. 30 ఏళ్లనాటి రోడ్డు సీసీగా మారడంపట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. పీఆర్ ఏఈ సురేష్ కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు శేష మఠం వెంకటేశ్వర్లు, నాగరాజు, రాయల చంద్రం తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పరిచినట్లు..!

అశ్వారావుపేటరూరల్: ఉద్యాన పంటల్లో మామిడి పంటను రారాజుగా పిలుస్తాంటారు. అలాంటి ఓ మామిడితోట స్థానికంగా పచ్చందాలను పంచుతోంది. తోటని మామిడి చేట్లే కాదు.. వాటి కింద ఉన్న నేల కూడా పచ్చదనాన్ని పరుచుకుని మామిడి రారాజు తన రాజాసాన్ని ప్రదర్శిస్తున్నట్లు ఉంది కదా ఈ ఫొటోలోని దృశ్యం!. అశ్వారావుపేట మండలంలోని వినాయకపురం–ఆసుపాక వెళ్లే మార్గంలో ప్రధాన రహదారికి అనుకుని ఓ రైతుకు చెందిన మామిడి తోట ఉంది. ఈ తోటలో మామిడి చెట్లన్నీ పచ్చని చిగురు ఆకులతో కళకళలాడుతుండగా.. కింద మైదానం కూడా పచ్చని గడ్డితో హరితమయంగా మారి ఆహ్లాదాన్ని కనబరుస్తుంది. ఈ దృశ్యాన్ని 'సాక్షి' కెమెరాలో క్లిక్‌మనిపించింది.



పచ్చదనం పరుచుకుని ఆకట్టుకుంటున్న మామిడి తోట

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం

శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు వరలక్ష్మీ వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు వేకువజామునే నిద్రలేచి, తలంటు స్నానాలు ఆచరించి, నూతన వస్త్రాలను ధరించారు. ఇళ్లలోని పూజా మందిరాల్లో వరలక్ష్మీ అమ్మవారిని మహిళలు ప్రత్యేకంగా అలంకరించి వ్రతాన్ని ఆచరించారు. శ్రావణమాస ప్రత్యేక పూజలు చేసి పలు రకాల నైవేద్యాలు సమర్పించారు. అలాగే వరలక్ష్మీ వ్రత కథను పఠనం చేశారు. ఇరుగు పొరుగున ఉన్న ముత్తైదువుల ఇళ్ల వద్దకు వెళ్లి వాయినాలు అందించారు. దీర్ఘకాలం సుమంగళిగా ఉంటూ, సుఖసంతోషాలతో జీవించేలా కృప చూపాలని అమ్మవారిని వేడుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



కరకగూడెం: వ్రతంలో ఓ కుటుంబం



అశ్వారావుపేటరూరల్: అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేస్తున్న మహిళలు



దుమ్ముగూడెం: పర్ణశాల ఆలయంలో కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు



అశ్వారావుపేటరూరల్: వాయినాలు ఇచ్చి, పుచ్చుకుంటున్న మహిళలు



చంద్రుగొండ: వరలక్ష్మి వ్రతం చేస్తున్న మహిళలు



దమ్మపేట: అమ్మవారికి సమర్పించిన నైవేద్యం..



కరకగూడెం: పూజలు చేస్తున్న బాలిక